దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి
శ్రీవారి సేవలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

తిరుమల,జులై 13ప్రభాతవార్తప్రతినిధి:

ప్రజాసేవ చేసుకునే శక్తిని ప్రసాదించమని, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు కేంద్ర రోడ్డురవాణా రహదారులశాఖలమంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. గురువారం వేకువజామున కుటుంబసభ్యులతో కలసి కేంద్రమంత్రి గడ్కరీ తిరుమలేశుని తోమాలసేవలో పాల్గొన్నారు. టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథమ్, వసతికల్పన విభాగం డిప్యూటీ ఇఒ పి.హరీంధ్రనాథ్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుండిశెట్టిపల్లి సమీపంలో
చిరుత సంచారం?

శాంతిపురం, జూలై 13 ప్రభాతవార్త

మండలంలోని గుండిశెట్టిపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల్లో చిరుత అడుగులు గుర్తించిన రైతులు ఉలిక్కిపడ్డారు. అయితే ఆ అడుగులు చిరుతవా లేక హైనావా అనేది తేలాల్సి ఉంది. అయితే రైతులు మాత్రం అవి చిరుతపులి అడుగులేనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పొలాల వద్దకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. అటవీ అధికారులు స్పందించాల్సి ఉంది.

చిరుతపులి అడుగులుగా భావిస్తున్న అడుగులు

21న సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి రాక
నేతన్న నేస్తం నగదు ఖాతాల్లో జమ చేయనున్న సీఎం

వెంకటగిరి, జులై 13, ప్రభాతవార్త:

వైఎస్ నేతన్న నేస్తం నగదును సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 21వ తేది వెంకటగిరి నుండి చేనేత కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు వస్తున్నారు. సీఎం పర్యటనకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. 80,686 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 24వేల చొప్పున ఖాతాల్లో రూ.300 కోట్లు సీఎం జగన్ బటన్ నొక్కి 21వ తేది జమ చేస్తారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సీఎం జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా వెంకటగిరికి ఆహ్వానించడంతో ఆయన అంగీకరించి వస్తున్నారు. వెంకటగిరిలో చేనేత కార్మికులు ఎక్కువ మంది ఉండడంతో ఇక్కడ నుండి నేతన్న నేస్తం నగదును కార్మికుల ఖాతాలో జమ చేస్తారు. 21వ తేది మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తారు. సీఎం పర్యటనకు ఏర్పాట్లను అధికారులు, నాయకులు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, రామ్‌కుమార్‌రెడ్డి

ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరికి వస్తున్న సందర్భంగా ఆయన పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. బహిరంగసభ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని చూశారు. హెలికాప్టర్ దించేందుకు గురుకుల పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పర్మినెంట్ హెలిప్యాడ్‌ను పరిశీలిం చారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి 21వ తేదీన నేతన్న నేస్తం నగదును చేనేత కార్మికుల ఖాతాల్లో వెంకటగిరి నుండి జమ చేస్తారు. చేనేత కాంర్మికులతో సమావేశం ఏర్పాటుపై కూడా చర్చించారు. సీఎం పర్యటన విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, ఆర్డీవో కిరణ్‌కుమార్, తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మీ తదితర శాఖల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో తిరుపతి రోడ్ల అభివృద్ధి
2024నాటికి రూ.17వేల కోట్లతో తిరుపతి జిల్లాలో రహదారులు పూర్తి
2025నాటికి రూ.13వేల కోట్లతో కడప-రేణిగుంట, తిరుపతి-మదనపల్లి, రేణిగుంట-నాయుడుపేట రహదారులు : కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

తిరుపతి/ తిరుపతి కలెక్టరేట్,జులై 13ప్రభాతవార్త:

అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతిచెందిన ప్రసిద్ధ యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం తిరుపతి నగరానికి వచ్చే రోడ్లు అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధిపరచాలని కేంద్రరోడ్డురహదారులశాఖమంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. తిరుపతి జిల్లాలో 2,900 కోట్ల రూపాయలు విలువైన జాతీయ రహదారుల నిర్మాణానికి తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, రాష్ట్రమంత్రి దాడిశెట్టిరాజా,రోడ్లుభవనాలశాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్నతో కలసి శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోనే ఈ ఏడాది 8,744 కిలోమీటర్ల హైవేలు నిర్మిస్తున్నామన్నారు. పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు పెంచడం ద్వారానే పేదరికం నిర్మూలించగలమని తెలిపారు. రాష్ట్రానికి మరింతగా పరిశ్రమలు రాబోతున్నాయని, తిరుపతి జిల్లాలో 13వేల కోట్ల రూపాయలతో జరుగుతున్న కడప-రేణిగుంట, తిరుపతి -మదనపల్లి, రేణిగుంట-నాయుడుపేట 6లైన్ల రహదారులు 2025నాటికి

పూర్తికానున్నాయని చెప్పారు. ఒక్కతిరుపతి జిల్లాలోనే 17వేల కోట్ల రూపాయలతో జరుగుతున్న పనులు 2024నాటికి పూర్తికానున్నాయన్నారు. కృష్ణపట్నం పోర్ట్ సమీపంలో నాయుడుపేట-తూర్పుకనువూరు 6లేన్ల రహదారి 35కిలోమీటర్లు 1,399కోట్లతో, చిల్లకూరుక్రాస్ నుండి తూర్పుకనువూరు వరకు 4లేన్ల రహదారి ,తూర్పుకాన్పూర్ నుండి కృష్ణపట్నం పోర్ట్‌సౌత్ గేట్ వరకు 6లేన్ల రహదారి 36కిలోమీటర్లు 909కోట్ల రూపాయలతో శంఖుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. కృష్ణపట్నం పోర్టు వేగవంతమైన కనెక్టివిటీ కోసం నేషనల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ,నేషనల్ మాస్టర్‌ప్లాన్‌రోడ్స్,చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్,నెల్లూరు వద్ద సెజ్ పారిశ్రామిక నోడ్‌ల వల్ల అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు 202 ఆగస్టులో ఏపిఎస్‌ఆర్టీసితో ఎంఓయు జరిగిందని, ఈ జులైలో పూర్తికానున్నదన్నారు. మంచి డిజైన్‌తో హైవే అథారిటీ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం జరగనుందన్నారు. ఏర్పేడు హైవేపనులను 2024లోపు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రరవాణాశాఖామంత్రి దాడిశెట్టిరాజా, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, ఎంఎల్‌సికల్యాణచక్రవర్తి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, తిరుపతి ఆర్‌డిఒ కనకనరసారెడ్డి, ఎన్‌హెచ్‌ఏఐ సలహాదారుడు ఏకె జైన్, ఎన్‌హెచ్ పిడి వెంకటేశ్వర్లు, స్మార్ట్‌సిటీ ఎండి చంద్రమౌళి, జిల్లాఅధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఇక్కడ తిరుపతి జిల్లాలో రహదారుల నిర్మాణం,జాతీయ రహదారుల అభివృద్ధి ఫోటోప్రదర్శనను కేంద్రమంత్రి గడ్కరీ వీక్షించారు.

అభివృద్ధికి సహకరించిన కేంద్రమంత్రికి కృతజ్ఞతలు
రూ.400కోట్లతో తిరుపతిలో ఇంటర్‌మోడల్ స్టేషన్
-తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి

తిరుమల,జులై 13ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి జిల్లాలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరుకు సానుకూలంగా స్పందించిన కేంద్రరోడ్లురహదారులశాఖమంత్రి నితిన్‌గడ్కరీకి తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తిరుపతి జిల్లాలోని చిల్లకూరు క్రాస్ నుంచి కనువూరు నాలుగులైన్ల రహదారి, తూర్పుకనువూరునుంచి కృష్ణపట్నం పోర్టు దక్షిణ గేట్ వరకు 6లైన్ల రహదారి నిర్మిస్తారన్నారు. ఈ నిర్మాణాలకు కృష్ణపట్నం పోర్ట్ ప్యాకేజీ -2ద్వారా 909.24కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. కేంద్రాన్ని అడిగిన వెంటనే 6,105.24కోట్లు రహదారుల నిర్మాణానికి, తిరుపతిలో ఇంటర్ మోడల్ స్టేషన్ నిర్మాణానికి 400 కోట్లతో మంజూరుకు గడ్కరీ సహకారం పట్ల ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో గురువారం ఉదయం కేంద్రమంత్రి గడ్కరీని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి కలసి శ్రీవారి జ్ఞాపికతో సత్కరించారు.

పిల్లలను కిడ్నాప్ చేసే యత్నం
మాజీ తల్లితో సహా నలుగురు అరెస్ట్ - అర్బన్ సిఐ

కుప్పంరూరల్, జూలై 13 ప్రభాతవార్త

భర్త నుంచి విడాకులు పొందిన భార్య తన మాజీ భర్త వద్ద ఉన్న ఇద్దరు పిల్లలు బడికి వెళ్తుండగా వారిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన మాజీ తల్లితో పాటు మరో ముగ్గుర్ని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ శ్రీధర్ తెలిపారు. ఈసంఘటనకు సంబంధించి సిఐ తెలిపిన మేరకు వివరాలిలా.. మల్లానూరుకు చెందిన నరసింహులు అనే వ్యక్తికి దివ్యశ్రీ అనే మహిళతో గతంలో వివాహం జరిగిందన్నారు. నరసింహులు రైల్వేస్‌లో పనిచేస్తున్నాడన్నారు. నరసింహులు, దివ్యశ్రీలకు పునర్విక (6), శాన్విక (4) అనే అమ్మాయిలు సంతానం కలిగారన్నారు. అయితే భార్యభర్తల మధ్య వివాదాలతో గత ఆరేడు నెలలక్రితం కోర్టు నరసింహులు, దివ్యశ్రీలకు విడాకులు మంజూరు చేసిందన్నారు. ఈనేపథ్యంలో పిల్లలు తండ్రి నరసింహులు వద్దనే ఉండేవారన్నారు. గురువారం మల్లానూరులో పునర్విక, శాన్వికలు స్కూలుకు వెళ్లేందుకై స్కూలు బస్సు ఎక్కారన్నారు. అయితే ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేయాలని భావించిన మాజీ తల్లి దివ్యశ్రీ ఆమె సోదరులు అర్జున్, రాజశేఖర్, డ్రైవర్ వినోద్‌లు కారులో వచ్చి స్కూల్ బస్సును మార్గమధ్యంలో అటకాయించారన్నారు. సమాచారం తెలుసుకున్న తాము వెంటనే సంఘటనా స్థలికి చేరుకుని పిల్లలను కిడ్నాప్ చేయాలనుకున్న మాజీ తల్లితో పాటు మరో ముగ్గుర్ని అదుపులో తీసుకున్నామని పేర్కొన్నారు.

అమ్మవారి ఆలయంలో రాత్రి కూడా అన్నప్రసాద వితరణ
టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

తిరుచానూరు, జులై 13, ప్రభాతవార్త

టిటిడి స్థానిక ఆలయాల్లో నిరంతరాయంగా అన్న ప్రసాద వితరణకు యోచిస్తున్నామని టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద గల అన్నప్రసాద భవనంలో రాత్రి వేళ కూడా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చైర్మన్ గురువారం రాత్రి ప్రారంభించారు. ముందుగా అన్న ప్రసాద భవనంలో స్వామి, అమ్మవార్ల చిత్ర పటాలకు పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీ వారి దర్శనానికి విచ్చేసి భక్తులకు రోజుకు రెండు పూటలా కలిపి దాదాపు ఒక లక్షా 30 వేల మందికి రుచిగా, శుచిగా అన్న ప్రసాదాలు అందిస్తున్నామని తెలిపారు. తిరుచానూరు ఆలయంలో ప్రస్తుతం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇక్కడ అన్న ప్రసాదాలు అందిస్తున్నారని తెలిపారు. గురువారం నుంచి సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అదనంగా అన్నప్రసాదాలు అందించే ఏర్పాట్లు చేపట్టామని వివరించారు.కార్యక్రమంలో శాసన సభ్యులు, టిటిడి బోర్డు సభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, మూరంశెట్టి రాములు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి అధికారి సాయిబాబా రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అందరి కళ్లూ షార్ మీదనే

- నేడే మామ వద్దకు చంద్రయాన్-3 ప్రయాణం
- ముహూర్తం మధ్యాహ్నం 2.35 గంటలకు
- గంటన్నర ముందే మొదలైన కౌంట్‌డౌన్
- సిద్ధంగా భారత బాహుబలి రాకెట్

శ్రీహరికోట (తడ), జూలై 13 ప్రభాతవార్త

అంతరిక్ష పరిశోధనలో భారత్ మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. తెలుగు నేల శ్రీహరికోట నుంచి చంద్రయాన్-3 ప్రయోగం శుక్రవారం మధ్యాహ్నం జరగనుంది. భారత బాహుబలి రాకెట్ ఎల్‌విఎం3-ఎం4 ఈ ఉపగ్రహాన్ని అంతరిక్షానికి మోసుకెళ్లనుంది. 642 టన్నుల బలశాలి అయిన ఈ రాకెట్ 3894 కిలోల బరువు ఉన్న చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని భూమికి 170 కిలోమీటర్ల దగ్గర దూరం పెరిజి, 36500 కిలో మీటర్ల ఎక్కువ దూరం అపోజిలలోని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టాల్సి ఉంది. మొత్తం రాకెట్ ప్రయాణం సుమారు 16 నిమిషాలు కాగా, రాకెట్ చివరి దశలో వేగం సెకనుకు 10 కిలోమీటర్లు పైనే ఉంటుంది. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగంతో అడుగడుగునా పోలీసులు, సిఐఎస్‌ఎఫ్ దళాల తనిఖీలతో నిండి ఉంది. 9 వేల మందికి పైగా వీక్షకులు ఇక్కడి విజిటర్స్ గ్యాలరీ నుంచి ఈ రాకెట్ ప్రయోగాన్ని సందర్శించనున్నారు. ఉదయం నుంచే పెద్దసంఖ్యలో వాహనాలు షార్‌కు తరలి వెళతాయని ముందుగానే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తిరుపతి జిల్లాలోని 80 మందికి పైగా పోలీసులు షార్‌లో బందోబస్తుకు చేరుకున్నారు. వీరితో పాటు వందలాది సిఐఎస్‌ఎఫ్ పోలీసులు కమాండెంట్ రేఖా నంబియార్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ

పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నాయుడుపేట సబ్ డివిజన్ పరిధిలోని ఒక డీఎస్పీ, ఇద్దరు సిఐలు, మరో ఏడుగురు ఎస్‌ఐల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రయోగ వీక్షణకు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖమంత్రి జితేంద్రసింగ్, నేషనల్ పోలీస్ అకాడమి డైరెక్టర్ అమిత్‌గార్గ్ తదితరులు వస్తున్నట్లు సమాచారం.

గంటన్నర ముందే మొదలైన కౌంట్‌డౌన్

చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని మోసుకెళ్లే ఎల్‌విఎం3-ఎం4 రాకెట్‌కు ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగా చెప్పినట్లు కాకుండా గంటన్నర ముందే కౌంట్‌డౌన్ మొదలుపెట్టారు. గురువారం మధ్యాహ్నం 1 గంట 5 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మొత్తం 25 గంటల 30 నిమిషాల పాటు కౌంట్‌డౌన్ కొనసాగనుంది. ఈ ప్రక్రియలో ద్రవ ఇంధనం నింపడంతో పాటు ఆఖరి నిమిషాలలో అత్యంత క్లిష్టమైన క్రయోజనిక్ ఇంధనాన్ని కూడా నింపుతారు. రాకెట్‌లో అన్ని ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యవస్థలను సరిచూసుకుంటున్నారు. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ గత రెండురోజులుగా షార్‌లోనే ఉంటూ రాకెట్ ప్రయోగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలావుంటే శ్రీహరికోటపై ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టి కేంద్రీకృతమైంది. విశ్వ పరిశోధనల కోసం ఎన్ని రాకెట్ల ద్వారా మరెన్నో శాటిలైట్లు ప్రయోగించినప్పటికీ చంద్రయాన్ ప్రయోగాలు ఎప్పటికప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.

అటు అమ్మణ్ణి ఆరాధన

శ్రీహరికోట (తడ), జూలై 13 ప్రభాతవార్త

విశ్వ పరిశోధనలో భాగం పంచుకుంటూనే ఇస్రో ఛైర్మన్ సాంప్రదాయాన్ని మరచిపోవడం లేదు. చంద్రయాన్-3 ప్రయోగానికి ముందు శ్రీహరికోటకు సమీపంలోని సూళ్లూరుపేటలో ఉన్న శ్రీచెంగాళమాత పరమేశ్వరి ఆలయాన్ని ఆయన గురువారం ఉదయం 7.30 గంటలకే దర్శించుకున్నారు. అమ్మణ్ణి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. వినాయకుని వద్ద, సుబ్రహ్మణ్యస్వామి వద్ద తదేక దీక్షతో దండంపెట్టి మొక్కుకున్నారు. అనంతరం అమ్మణ్ణి గర్భగుడిలోకి వెళ్లి చెంగాళమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేయాలని చెంగాళమ్మను ప్రార్థించారు.

ఇటు ఇస్రో పరిశోధన

శ్రీహరికోట (తడ), జూలై 13 ప్రభాతవార్త

ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ శ్రీహరికోటలో ఘన ఇంధన మోటార్ల సామర్థ్యం పెంచే కీలకమైన సమూహాన్ని ప్రారంభించారు. అంతరిక్ష పరిశోధనలో ఆయన ఆరితేరిపోయారు. శుక్రవారం జరిగే చంద్రయాన్-3ని విజయవంతంగా ప్రయోగించడానికి ఇస్రో ఛైర్మన్ షార్ లో ఇప్పటికే శాస్త్రవేత్తలతో పలుసార్లు కీలక సమావేశాలు నిర్వహించారు. పరిశోధనలు చేస్తూనే ఆయ న శ్రీహరికోటలో అదనపు ఘన ఇంధన మోటార్ల సామర్థ్యం పెంచే కీలకమైన మిక్సింగ్ ప్రొపల్లెంట్ కాస్టింగ్ సౌకర్యాలు పెంచారు. ఇప్పటికే ఎస్‌ఎస్‌ఎల్‌వి, పిఎస్‌ఎల్‌వి, జిఎస్‌ఎల్‌వి, ఎల్‌విఎం3 రాకెట్లలో ఘన ఇంధన మోటార్లు కీలకంగా ఉన్నాయి. వదేపదే రాకెట్ల సంఖ్య పెరుగుతున్న కారణంగా అదనపు సామర్థ్యం పెంచుకోవడానికి ఇస్రో షార్‌లోని స్ట్రాబ్‌లో ప్రస్తుతం ఈ కార్యక్రమం చేపట్టింది.

ప్రతిష్టాత్మకంగా దేశమ్మ ఆలయ నిర్మాణం : మంత్రి రోజా

నగరి, జూలై 13 ప్రభాతవార్త:

రాతి స్తంభాలకు పసుపు కుంకుమలు పెడుతున్న మంత్రి రోజా

నేత్ర ప్రధాత, గ్రామదేవత దేశమ్మ దేవాలయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్టు మంత్రి రోజా అన్నారు. గురువారం ఆలయ నిర్మాణంలో భాగంగా నిర్వహించిన ద్వారబంధన ఏర్పాటు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. ఆలయంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన హోమ పూజల్లో పాల్గొన్న ఆమె ద్వారబంధనంకు సిద్ధం చేసిన రాతి స్తంభాలకు పసుపు కుంకుమలు రాసి పూజలు చేసి అనంతరం క్రేన్ సాయంతో ద్వారబంధనమును తీసుకు రాగా వాటిని నిర్ణయించిన ప్రాంతంలో అమర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామదేవత దేశమ్మ అమ్మవారి ఆలయాన్ని పున:ర్నిర్మించడం ఆమె తనకు ఇచ్చిన అనుగ్రహం అన్నారు. ఆలయ పునిర్నిర్మాణం కోసం ముఖ్యమంత్రి సాయంతో రూ.1.20 కోట్లు మంజూరు చేయించ గలిగానన్నారు. త్వరలో వైభవంగా అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తవుతుందన్నారు. వేద పండితులు మంత్రోచ్ఛారణలతో మంత్రిని ఆశీర్వదించారు.

ప్రణాళికాబద్ధంగా గణపయ్య బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

కాణిపాకం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై చర్చిస్తున్న ఆలయ ఛైర్మన్ , ఈఓలు

కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంభందించి ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు ఆలయ అధికారులు సహకరించాలని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆలయ అధికారులతో గురువారం ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లులో భాగంగా చేపట్టవలసిన పనులకు సంభందించి టెండర్లు నిర్వహణ, బ్రహ్మోత్సవాల విధివిధానాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏఏ పనులు చేపట్టాలనే విషయమై ఆలయ అధికారులతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి, హేమమాలిని, సూపరెండెంట్‌లు రంగస్వామి, రవి, ఆలయ ఏఈలు పాల్గొన్నారు.

మల్లానూరు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా

- తెదేపా నేతలు

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

వైకాపా అధికారంలో వచ్చాక మండలంలోని మల్లానూరులో ఒకే కుటుంబం బాగు పడింది తప్ప అభివృద్ధి జరగలేదని, మల్లానూరులో జరిగిన అవినీతిపై చర్చకు మీరు సిద్ధమా అని తెదేపా యువత అధ్యక్షుడు వెంకటేష్, మాజీ యువత అధ్యక్షుడు చెక్కునత్తం మణి, అశోక్, సతీష్, గోపి, నాగేం ద్ర, నరేష్ తదితరులు పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ కుటుంబీకులు తెదేపా నేతలపై విమర్శలు చేయడం దారుణమన్నారు. మల్లానూరులో వారు చేసిన భూ అక్రమాలు అందరికీ తెలుసన్నారు. మాజీ ఎంపిపి సాంబశివం, మాజీ సర్పంచ్ రామచంద్ర, కాణిపాకం వెంకటేష్‌లను విమర్శించడం భావ్యం కాదన్నారు. మల్లానూరులో అభివృద్ధి అడ్డుకున్నామని చెప్పడం సబబు కాదన్నారు. నడిరోడ్డులో గుంతలు పూడ్చలేని అధికార పార్టీ నేతలు మల్లానూరులో దౌర్జన్యంగా దుకాణాలు తొలగింపజేయడం, చెరువు ఆక్రమణలకు యత్నించడం మల్లానూరు ప్రజలకు తెలుసన్నారు. దుకాణదారులకు కొట్టే హక్కు వైకాపా నేతలకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్‌గా కుప్పంలో ఎన్ని కోట్ల అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

ప్రజల కోసమే జగనన్న ప్రభుత్వం - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, జూలై 13 ప్రభాతవార్త

ప్రజల కోసమే సిఎం జగనన్న ప్రభుత్వం పనిచేస్తోం దని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకటేపల్లి, ఎద్దులపల్లి గ్రామాల్లో ఆయన గడపగడపకు కార్యక్రమం చేపట్టారు. సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి వారికి కలిగిన లబ్ది గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసు లు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, సర్పంచ్ ఎవి జయరాం, జగదీష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జిఓ నెం 52ను వెంటనే రద్దు చేయాలి

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

ఎస్టీల జాబితాలో వాల్మీకి, బోయలను చేర్చేందుకు ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 52ను వెంటనే రద్దు చేసేలా చూడాలని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యశంకర్ నాయక్‌ను ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవినాయక్ ప్రకటనలో కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా గిరిజనుల జీవితాల్లో మార్పులు రాలేదని ఎస్సీ,ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ అయ్యేలా చూడాలన్నారు. స్పెషల్ డిఎస్సీ నిర్వహించాలన్నారు. అటవీ ప్రాంత గిరిజన రైతులకు పంటనష్టం పరిహారం అందేలా చూడాలన్నారు. కుప్పంలో గిరిజన కమ్యూనిటీ భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే : ఎంఈఓ

గంగవరం,జూలై 13, ప్రభాతవార్త :

అలనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని ఎంఈఓ కె వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గంగవరం ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ రెడ్డిని ఆయన వద్ద విద్యను అభ్యసించిన (2004, 2005) నాటి విద్యార్థులు భాస్కర్,మణి,మోహన్, మునెప్ప, వెంకటాద్రి, జయచంద్ర తదితరులు పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు గణితశాస్త్రం భోదిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి ఐరాల మండలం నుండి గంగవరం ఎంఈఓగా బదిలీపై వచ్చారని తెలుసుకున్న పూర్వపు విద్యార్థులు గురువారం సాయంత్రం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయనకు దుశ్శాలువ కప్పి,పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో వేణుగోపాల్‌రెడ్డి ఎంతో క్రమశిక్షణతో,విలువలతో కూడిన విద్యను అందించేవారని,గణిత శాస్త్రంలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేవారమన్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ రోజువారి తరగతి గదిలో ఉపాధ్యాయుల చేసే ఉత్తమ బోధనతోనే భవిష్యత్ సమాజం గొప్పగా నిర్మితమతుందని ఆయన పేర్కొన్నారు. దాదాపు 20 ఏళ్ళ తరువాత గురువులను గుర్తుంచుకొని తన పూర్వపు విద్యార్థులతో అలనాటి మధురమైన మరుపురాని సంఘటనలను,చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని,ఆద్యంతం ఉల్లాసంగా,ఉత్సాహంగా గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నకేశవులు,వైసీపీ నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చిత్రహింసలకు గురిచేసిన చేసిన

హోంగార్డ్‌ను వెంటనే అరెస్టు చేయాలి -మహిళా సంఘాలు

పలమనేరు,జూలై 13,ప్రభాతవార్త:

భార్యను నెల రోజులు గృహనిర్భందం చేసి చిత్రహింసలకు గురి చేసిన హోంగార్డ్ చాంద్ బాషాను వెంటనే అరెస్టు చేయాలని మహిళా సంఘాలు,అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పలమనేరు ఆర్టీసి డిపో నందు హోంమ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న చాంద్ బాషా గత నెల రోజులుగా ఇంటిలో ఓ గదిలో తన భార్య సబిహాను నిర్బందించి చిత్రహింసలకు గురిచేసి తీవ్రంగా గాయపరచడం దారుణమన్నారు. మొగ పిల్లలు కలగలేదనే కారణంతో సబిహాపై అమానుషంగా వ్యవహరించి నెల రోజులు గదిలో నిర్బందించిన చాంద్‌బాషాను విధుల నుండి తొలగిచి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరిని కలసిన తులసినాథ్

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు డి. పురంధేశ్వరిని రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు తులసినాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలో గురువారం బిజెపి అధ్యక్షురాలిగా పురంధేశ్వరి బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమెను దుశ్శాలువతో తులసినాథ్ ఘనంగా సత్కరించారు. కుప్పంలో పార్టీబలోపేతానికికృషిచేయాలనిత్వరలోనే కుప్పం పర్యటనకు వస్తానని పురంధేశ్వరి పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ద్రవిడ వర్సిటీలో పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

ద్రవిడ వర్సిటీలో 2023-24విద్యా సంవత్సరంకు గాను వివిధ విభాగాల్లో పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. యుజిసి నెట్, జెఆర్ఎఫ్, యుజిసి నెట్, సిఎస్ఐఆర్ నెట్, గేట్, సిఇఇడి రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 21లోగా చేసుకోవాలని సూచించారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

నేడు రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యశంకర్ నాయక్ పర్యటన

కుప్పం, జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్యశంకర్ నాయక్ రామకుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30గంటలకు రామకుప్పం మండలం వీర్నమల, పెద్ద తాండాలకు చేరుకుని అక్కడ గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో చిత్తూరుకు చేరుకుంటారు. శనివారం ఉదయం 10.30గంటలకు గంగవరం మండలం కుయ్యవ ంక గిరిజన కాలనీలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు.

మందకృష్ణ మాదిగను కలసిన ఎంఆర్‌పిఎస్ నేతలు

కుప్పంరూరల్, జూలై 13 ప్రభాతవార్త

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను కుప్పంకు చెందిన ఎంఆర్‌పిఎస్ నేతలు వరంగల్‌లో కలిశారు. ఈసందర్భంగా కుప్పంలో ఎంఆర్‌పిఎస్ నేతలపై దాడి చేసిన వైకాపా కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ అతనిపై నమోదైన కేసు గురించి మందకృష్ణకు వివరించారు. ఈసందర్భంగా దాడిలో గాయపడ్డ సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. త్వరలోనే కుప్పం వస్తానని మందకృష్ణ పేర్కొన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నేతలు దేవరాజ్, రాజ్‌కుమార్, ప్రకాష్, మురుగేష్, రవీంద్ర, గోవిందప్ప, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

గుడుపల్లె, జూలై 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన గుడుపల్లెలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షుడు అమీర్, నియోజకవర్గ నాయకుడు డా॥ నరేష్‌ల అధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కొంతమంది వైకాపా నేతల ప్రోద్బలంతో వాలంటీర్లు ఇలా వ్యవహరించడం తగదన్నారు. శ్రీకాళహస్తి సిఐ అంజుయాదవ్ జనసేన నేతలపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. జనసేన నేత సాయిపై దాడి చేసిన సిఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

అభివృద్ధి,సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యం

-ఎమ్మెల్యే వెంకటేగౌడు.

పెద్దపంజాణి జూలై13 ప్రభాతవార్త :

రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమం సిఎం జగనన్నతోనే సాధ్యమౌతుందని పలమనేరు ఎమ్మెల్యే డా॥ఎన్.వెంకటేగౌడు పేర్కొన్నారు. గురువారం స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపిటిసి కె.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దవెలగటూరు పంచాయతీ పరిధిలోని చిన్నవెలగటూరు, ఓబులాపురం,షికారిపాళ్యం గ్రామాల్లో ఎమ్మెల్యే డా॥ఎన్.వెంకటేగౌడు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా 270గృహాలను సందర్శించి వైకాపా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజాసంక్షేమపథకాలు అందుతున్నాయా! లేదా! అని అడిగితెలుసుకుని నేరుగా లబ్దిదారులకు కరపత్రాలను అందజేశారు. అనంతరం సంక్షేమపథకాల గురించి ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైకాపాను గెలిపించి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎన్.రెడ్డెప్ప,జెడ్పీటిసి సుస్మాకీర్తి,మండల కన్వీనర్ బాగారెడ్డి,వైస్ ఎంపిపిలు అంజమ్మ,ఏఎంసి డైరక్టర్ సురేష్,సర్పంచ్‌లు హరినాథ్,స్వర్ణలత,వైకాప జిల్లా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి,వైకాపా నేతలు అమర్నాథ్ రెడ్డి,పూలశంకర్ రెడ్డి,రాజారెడ్డి,ప్రసాద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి,ఓబులాపురం కృష్ణమూర్తి,మండలస్థాయి అధికారులు,గృహసారథులు,పంచాయతీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

రొంపిచెర్ల,జూలై13ప్రభాతవార్త

మండల పరిదిలోని చిచ్చిలివారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరనగా పంపిణీ చేశారు. కుమ్మరపల్లెకు చెందిన పి.రెడ్డెప్ప,పి.రాశి దంపతులు వీటిని అందజేశారు. నోటుపుస్తకాలు ,పెన్సిళ్లు, పలకలు, ప్యాడ్స్, స్కెచ్‌పెన్నులు వంటివి అందించారు. విద్యార్థులు చిన్నప్పటినుంచి బాగా చదివి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎనివాసులు, గ్రామసర్పంచి చిచ్చిలి అరునమ్మ,ప్రధానోపాధ్యాయుడువి.వెంకట్రామయ్య,ఉపాధ్యాయులు,విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై తవణంపల్లెలో వాలంటీర్లు నిరసన

తవణంపల్లె, జూలై 13 ప్రభాతవార్త:

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్ల వ్యవస్థపై చేసిన వ్యాఖ్యల మండలంలోని వాలంటీర్లు మండల కేంద్రం తవణంపల్లెలో నిరసన ర్యాలీ, మానవహారం, దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వాలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయం నుండి టి.పుత్తూరు రోడ్డు వరకు నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంతకు ముందు మండల కార్యాలయం ఆవరణలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు వాలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బహిరంగక్షమాపణ చెప్పాలని డిమాండు చేస్తూ నినాదాలు చేశారు.ండలంలోని వాలంటీర్లు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవు

-సిఐ చంద్రశేఖర్

పలమనేరు,జూలై 13,ప్రభాతవార్త:

మైనర్ పిల్లలు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని సిఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఆయన రహదారులపై మైనర్ పిల్లలు అధికంగా ద్విచక్రవాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురికావడం జాతీయ రహదారిపై విన్యాసాలు చేయడం జరుగుతున్నాయని వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆయన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో కొంత మంది పిల్లలు రోడ్లపై అధిక వేగంతో వెళ్లడం, విన్యాసాలు చేయడం ద్విచక్రవాహనాలలో మార్పులు చేసి అధిక శబ్దాలతో వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలు కోరిక మేరకు వాహనాలు ఇవ్వడం సరికాదని ప్రమాదాలు జరిగితే వారి భవిష్యత్తు అందకారంగా మారుతుందన్నారు. మైనర్ పిల్లలు ద్విచక్రవాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ

వెంకటగిరి, జులై 13, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపారు. వెంకటగిరి పట్టణం 21, 22 వార్డులలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష పథకంలో సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలు సుకొని పరిష్కరించారని తెలిపారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలనను ప్రభుత్వం చేరవేరుస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష క్యాంపులను వినియోగించుకోవాలని తెలిపారు. వైసీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. పవన్‌కళ్యాణ్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడంలేదని విమర్శించారు. వలంటీర్లు కరోనా సమయంలో విస్తృతంగా సేవలు అందించారని తెలిపారు. వలంటీర్ల సేవలను అందరూ అభినందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కమిషనర్ వెంకటరామయ్య, వైస్‌చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు ఎం.ఎ.నారాయణ, పూజారి లక్ష్మీ, కళ్యాణి, శంకరయ్య, శేఖర్, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

వడమాలపేట, జూలై 13 ప్రభాతవార్త:

ప్రజలు సమస్యలు పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదపడుతుందని ప్రత్యేక అధికారి గీతారాణి పేర్కొన్నారు. వడమాలపేట మండలం ఏఎం పురం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 470 టోకెన్స్ రైజ్ చేసి 392 ధృవపత్రాలు ప్రజలకు అందజేశారు. ఇందులో కుల ధృవీకరణ పత్రాలు 193, ఆదాయ ధృవపత్రాలు 203, ఆధార్‌కు మొబైల్ లింక్ 40, రైస్ కార్డుస్పిటింగ్, కుటుంబ సభ్యుల చేర్పులు ధృవపత్రం 10, మరణ ధృవపత్రం 4, మ్యుటేషన్ 1, ఇతరులు 1 లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి రోజా సోదరులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ, మండల సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.భానుమూర్తి రావు, కార్యాలయ పరిపాలనాధికారి ఏ.శేఖర్, తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం, అన్నిశాఖల మండల స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

ఎంపిడిఓ రజనీకాంత్

ఓజిలి, జులై 13, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపిడిఓ రజనీకాంత్ అన్నారు. గురువారం వెంకటరెడ్డి పాలెం గ్రామం సచివాలయంలో ఈవోపిఆర్‌డి షేక్ సిరాజ్ అధ్యక్షతన కొండవల్లిపాడు సర్పంచ్ కొండూరు ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిడిఓ రజనీకాంత్, తహశీల్దార్ శివరామ సుబ్బయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ భాషా, ఎంపిటిసి తుపాకుల మీనాక్షి, వైసిపి సీనియర్ నాయకులు దేశి రెడ్డి మధుసూధన్ రెడ్డి, బట్ట సుబ్రమణ్యం యాదవ్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సర్టిఫికెట్లు కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి 350 సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వైసా ఖర్చు లేకుండా అవసరమైన సర్టిపికెట్లన్నీ అధికారులు గ్రామాల్లోకి వచ్చి అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం నిర్మల, ఎంఈఓ శైలజ, ఏపీవో ఉషారాణి, ఐసిడిసి సూపర్‌వైజర్ ఉప సర్పంచ్ గోపినాద్, అఖిల్ రెడ్డి, ఆర్ఐ విజయ్ కుమార్, వీఆర్ఓ సుబ్రమణ్యం, టిఏ మహేష్, ఏఎస్ఐ రాధా, వైసిపి నాయకులు జి. రవి, సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, పోలీసులు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్‌లో ముగిసిన శిక్షణా తరగతులు

కోట, జూలై 13 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ టీచింగ్ అండ్ లెర్నింగ్‌పై జిల్లా స్థాయిలో శిక్షణా తరగతులను ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు 800 మందికి పైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ శిక్షణా తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, డిప్యూటీ డిఇఓ శివప్రకాష్‌రెడ్డి, ఎఎంఓ శివశంకరయ్య, కోట ఎంఇఓ డి.మస్తానయ్య, చిట్టమూరు ఎంఇఓ బివికె కృష్ణయ్య, కోట జడ్పీ స్కూల్ హెచ్ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆరుగురు రిసోర్సు పర్సన్లు కిరణ్‌కిషోర్, వెంకటేశ్వర్లు, శివప్రతాప్‌రెడ్డి, కొండారెడ్డి, సురేష్‌బాబు, విష్ణువర్ధన్‌రెడ్డిలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు అటు హైస్కూలు విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబులు అందించారని, బైజూస్‌పై శిక్షణా తరగతులను తమ కళాశాలలో నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను తమ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతగానో ప్రోత్సహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌సి విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, అశ్వని నారాయణరావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎమ్మెల్యే వరప్రసాదరావు

కోట, జూలై 13 ప్రభాతవార్త

కేంద్ర రోడ్లు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని తిరుపతిలో గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు కలిశారు. అంతర్జాతీయ ప్రమాణాలు గల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నరోడ్లురవాణా,జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరిని కలిసి పలు సమస్యలు వివరించారు. కృష్ణపట్నం పోర్టుకు కన్వెన్సిటీ ప్యాకేజి 2, 3, 4 జాతీయ రహదారుల నిర్మాణానికి డిజిటల్ విధానంలో మంత్రి శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

మీ ఓటు సరిచూసుకోండి

కోట, జూలై 13 ప్రభాతవార్త

ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఓటర్లజాబితా పరిశీలనపై ఎన్నికల సంఘం అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలు పరిశీలించి అవసరమైతే చేర్పులు మార్పులకు అవకాశం కల్పించేలా ఆదేశాలిచ్చారు. ఈ నెల 21 నుంచి నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి ఇటీవల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో తుది ఓటర్ల జాబితా ఎన్నికల సంఘం విడుదల చేసింది. గత ఏడాది అక్టోబరు నెలలో చేపట్టిన సమగ్ర ఓటర్ల సవరణ ద్వారా అనేక మంది కొత్త ఓటర్లను చేర్పించారు. అయినా చేరాల్సిన వారు అధికంగానే మిగిలిపోగా చేరిన వారిలో ఓటర్ల పేర్లు, చిరునామాల్లో తేడాలొచ్చాయి. గతంలో ఎన్నికలకు ముందు మాత్రమే చేపట్టే ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని కొన్నేళ్లుగా నిరంతర ప్రక్రియగా మార్చేశారు. దీనిలో భాగంగా కొన్ని రకాల వెసులుబాటు కల్పిస్తూ ఎప్పటికప్పుడు ఓటర్లను చేర్పిస్తున్నారు. ఓటరు జాబితాతో బిఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరు ఇంటికి వెళ్లాల్సి, ఇందులో ఉన్న ప్రకారం ఓటర్లు ఉన్నారా ? వలస వెళ్లడం, మరణించడం తదితర పరిస్థితులు ఉన్నాయా పరిశీలిస్తారు. శాశ్వత వలసలు ఉంటే తొలగిస్తారు. దీంతోపాటు వారి పేర్లు, చిరునామాలు, ఇంట్లో ఓటర్లకు వేర్వేరు పోలింగ్ కేంద్రాలు ఉంటే ఒకే పోలింగ్ కేంద్రంలోకి వచ్చేలా చేయడం, ముఖ్యంగా నూతన ఓటర్లను చేర్పించడం చేస్తారు. వీరంతా ఈ నెల 21 నుంచి నెలరోజుల పాటు సర్వే చేయనున్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ముందస్తుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

పెరియవట్టు, వాటంబేడులలో జగనన్న సురక్ష కార్యక్రమం

తడ, జూలై 13 ప్రభాతవార్త

తడ మండలం పెరియవట్టు, వాటంబేడులలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పెరియవట్టులో జరిగిన సభలో తహశీల్దార్ జయజయరావు ఆధ్వర్యం వహించగా, ఎంపిపి కొళవి రఘురెడ్డి, జెఎసి కన్వీనర్ సుందరరెడ్డి, సర్పంచ్ చిన్నపయన్, ఇఓపిఆర్‌డి శేషారావు, హౌసింగ్ ఏఇ సత్యనారాయణ, ఎపిఎం రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వరుణ్‌లు పాల్గొన్నారు. వాటంబేడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిపితో పాటు డిసిఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్‌రెడ్డి, కారిజాత, వాటంబేడు సర్పంచులు సునీల్‌కుమార్‌రెడ్డి, మునిలక్ష్మి, ఎంపిడిఓ అమోస్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

యూసీసీని వ్యతిరేకిద్దాం

- ఎన్నికల కోసమే బిజెపి నాటకాలు

గూడూరు, జూలై 13 ప్రభాతవార్త

కేం

తిరుపతి డివిజన్

జగనన్న పథకాలతో బడుల రూపం మారింది

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్రంలో నిరుపేదల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల తీరు తెన్నులుమారాయని, రూపం మారిందని పట్టణ జెసిఎస్ ఇన్‌చార్జి తిరుకాల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 23వ వార్డు కొండమిట్ట వాటర్ ట్యాంకు దగ్గర సీనిమా వీధి 3వ గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ నేడు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు జరుగుతున్న అభివృద్ధి జగనన్న అభివృద్ధిని కళ్ళకు కట్టినట్లు చూపుతుందన్నారు. మున్సిపల్ అధికారులు డి.ఇఇ లలిత రెనెన్యూ ఇన్స్పెక్టర్ బబాలచంద్రయాదవ్, రవికాంత్, శ్రీనివాసులు జేసియస్ కన్వీనర్లు కే.మునిచంద్ర, కే.దయాకర్,వై.శైలజా రాణి,మున్సిపల్‌మేనేజర్ బి.ఉమామహేశ్వరరావుల సారధ్యంలో సర్టిఫికేట్లు పంపిణి చేసారు.

ఇసుకతాగేలిలో సిపాయి భరోసా

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్)జూలై 13 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని ఇసుకతాగేలి దళిత వాడలో ఇటీవల మృతి చెందిన ఓ కుటుంబసభ్యులకు ఎంఎల్‌సి, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోసాలో ఆదుకున్నారు. గురువారం ఆయన ఇసుకతాగేలి గ్రామంలోని దళిత వాడకు చేరుకున్నారు.కుక్క రమణయ్య ఇటీవల మృతి చెందారు.ఆయన కర్మకియలకు హాజరైన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. కుమారుడు జగదీష్‌కు కుటుంబ పోషణకు 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి తమ మద్దతును తెలిపారు.డాక్టర్ బాబు,ఏర్పేడు వైకాపా నాయకులు దశరధరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు ప్రశాంతతకు నిలయాలు

-పోలీసుల అక్రమకేసులు సహించేది లేదు

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త

పచ్చని పల్లెలు ప్రశాంతతకు నిలయాలని అయితే పోలీసుల జోక్యంతో పల్లెలు ప్రశాంతతను కోల్పోతున్నాయని తెలుగుదేశంపార్టీ నేత రాంబాబునాయుడు తెలిపారు. గురువారం శ్రీకాళహస్తి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ అక్కసుతో పచ్చని పల్లెల్లో అధికారపార్టీ నాయకులు పోలీసుల అండతో అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఎంపిటిసి ఎన్నికల్లో తనపైనే 2020 మార్చి 12లో మద్యం కేసులు పెట్టారని అయితే అప్పుడు తాము ఇంట్లో లేమని తెలిసినా కేసులు పెట్టించారన్నారు. అంతేకాకుండా తమపై ఎస్‌సి,ఎస్‌టి కేసు, 353కేసును పెట్టించారన్నారు. తనతో పాటు మరికొందరిపై కూడా కేసులు పెట్టారన్నారు. 2021లో నిమ్మరాళ్ళపల్లి ఘర్షణలో తాను లేకున్నా తనపై కేసు బనాయించారన్నారు. రెండు రోజుల ముందు ఓచిన్నపాప కిందపడితే తామే కత్తిపిడితో పొడిచినట్లు పిర్యాదుచేశారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని దుష్టసంస్కృతికి అధికారపార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. మాజీ సర్పంచ్ బత్తిరెడ్డిపై దౌర్జన్యం చేసి కొట్టడం, రాష్ట్ర కార్యదర్శి చలపతినాయుడుపై దౌర్జన్యం చేయడం చూస్తే అసలు శ్రీకాళహస్తిలో ప్రజాస్వామ్యం ఉందా అని ప్రజలు కూడా ఆలోచించు కోవాల్సి నసమయంఆసన్నమైందన్నారు.సమావేశంలోపలవురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

చల్లపాళెంలో జగనన్న సురక్ష సభలు

753 మందికి ధృవీకరణ పత్రాలు

శ్రీకాళహస్తిరూరల్,జూలై 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాలను ఎంపిడిఓ రఫీఖాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమంతో ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళకుండా ఇంటివద్దకే తాము కోరిన సర్టిఫికేట్లు అందజేయాలన్నది లక్ష్యం అన్నారు. ప్రతి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.సమావేశానికి ఎంపిటిసి హరి సారధ్యంలో నిర్వహించారు.కన్వీనర్లు రామచంద్ర,మునిరాజ, పంచాయతీ కార్యదర్శులు యూసుఫ్‌ఖాన్, సచివాలయ సిబ్బంది వాలంటరీర్లు పర్యవేక్షించారు.ఈ సభలో 733 మందికి 11 రకాల సర్టిఫికేట్లును అందించినట్లు అధికారులు ప్రకటించారు.

శివయ్య సేవలో మాజీ కేంద్ర మంత్రి పూజలు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలో గురువారంకేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ కుటుంబసభ్యులతో హాజరై దర్శించుకున్నారు.వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు శేష వస్త్రాలనుఅందించారు. ఏర్పాట్లను ఎఇఓ సతీష్‌మాలిక్,పర్యవేక్షించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

ఎస్‌సివి నాయుడు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు గురువారం పిలుపు నిచ్చారు.గురువారం ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి దృష్ట్యా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల్ని చైతన్యవంతుల్నిచేయటానికి పార్టీ నాయకుడు నారాచంద్రబాబునాయుడు బస్సు యాత్రను ఏర్పాటు చేసారన్నారు.తిరుపతి జిల్లాలో ప్రజాసమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి రాబోవు పార్టీ మెనిఫేస్టోలో పరిష్కారాలు పొందుపరచుటకు బస్సు యాత్ర ఎంతో ఉపయోగపడుతుందని పార్టీ భావించి ఈ కార్యక్రమాలు రూపొందించారన్నారు.ఈ నేపధ్యంలో ఈ నెల 14 నుంచి తిరుపతిజిల్లా తిరుపతిలోనూ, 15న శ్రీకాళహస్తి, 16న సత్యవేడు,17న సూళూరుపేట నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసారన్నారు. రోజంతా సాగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎస్‌సివి నాయుడు పిలుపు నిచ్చారు.

మహాశక్తికి తరలిరండి..టిడిపి మహిళానేత

శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త

మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో నేడు నిర్వహించనున్న మహాశక్తి కార్యక్రమానికి తెలుగు మహిళలు తరలిరావాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల.ఉష పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు చేతులమీదుగా మహాశక్తి కార్యక్రమం ప్రారంభిస్తున్నారని ఉష తెలిపారు. ఈ నాలుగేళ్ళ పాలనలో మహిళల జీవితాలు చితికిపోయాయని రానున్నది రామరాజ్యమని అందరు సంతోషంగా ఉండేరోజులు ముందున్నాయన్నారు. మహిళాశక్తి కలసికట్టుగా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కోరారు.

రూ.100కోట్లతో వికృతమాల వద్ద కార్పొరేట్ పాఠశాల

-కొత్తపల్లి మాజీ ఎంఎల్‌ఏ జలగం ప్రసాదరావు

తొట్టంబేడు, జూలై 14 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని వికృత మాల వద్ద సుమారు రూ.100 కోట్లతో నిరుపేదలకు కార్పొరేట్ విద్యను అందించేందుకు 'శ్రీమ న్నారాయణ ట్రస్టు' పేరుతో పాఠశాల నిర్మాణానికి రూప కల్పన చేశామని కొత్తపల్లి మాజీ ఎంఎల్‌ఏ జలగం.ప్రసాదరావు తెలిపారు. గురువారం తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు, యువత ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీమన్నారాయణ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా అన్నదాతలకు కావాల్సిన పరికరాలు ఎవైనా కావాలంటే రూ.20వేలు నగదు చెల్లిస్తే రూ.50వేలు విలువచేసే పరికరాలు అందించనున్నామన్నారు. ఇవేకాకుండా అన్నదాన సత్రాలు, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సేవా కార్యక్రమాలుపై దృష్టిసారించామని పలు ప్రాంతాల్లో చేపట్టేందుకు ఓ ప్రణాళిక రూపకల్పన చేస్తున్నామన్నారు. అనంతరం ఆయన్ను పిసిసి కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు, పూడి యువత నాయకుడు చక్రి, బాలాజీ, నాయకులు నాగూరయ్య, పలువురు గ్రామస్తులు సత్కరించారు.

పంచ్ ప్రభాకర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తొట్టంబేడు, జూలై 13 ప్రభాతవార్త

దళితజాతి గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పంచ్ ప్రభాకర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ జైభీం ఆర్మీ వ్యవస్థాపకులు పులిశ్రీకాంత్ టుటౌన్ సిఐ మల్లిఖార్జునకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ దళితులు ఎన్నో కష్టాలు పడి అహర్నిశలు శ్రమించి తమ బిడ్డలకు చదువులకోసం నిరంతరంగా శ్రమచేస్తూ నమ్ముకున్న నాయకులకు అవసరమైతే ప్రాణాలైనా అర్పించి విశ్వాసంగా ఉంటున్న దళితుల గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వారి మనోభావాలు దెబ్బతినేవిధంగా పంచ్ ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విదేశాల్లో ఉన్న ఆయన్ను మనదేశానికి రప్పించి చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జైభీం ఆర్మీ పట్టణ అధ్యక్షులు కన్నలిరమేష్, నాయకులు చలపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ జాబ్ మేళాలో 29 మంది ఎంపిక

పుత్తూరు, జూలై 13 ప్రభాతవార్త : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జవహర్ నాలెడ్జి కేంద్రం, చెన్నైకు చెందిన కాల్ మ్యాన్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కాల్‌మ్యాన్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 82 మంది హాజరవగా 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని అందులో 11 మంది పుత్తూరు డిగ్రీ కాలేజీకి చెందిన వారని తెలిపారు. ఎంపికైనవారు చెన్నైలో కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయాల్సి వుంటుందని, నెలకు రూ. 15,000 నుంచి రూ. 18,000 వరకూ జీతం, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ వి.వీరయ్య, డాక్టర్ జి.కోటేశ్వరయ్య, ఐక్యుఎసి సమన్వయకర్త డాక్టర్ సి.నరసింహారెడ్డి,స్కిల్‌డెవలప్‌మెంట్‌సమన్వయకర్తటి.నరసింహులు,జెకెసి సమన్వయకర్త సిహెచ్.రాము, ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఉషారాణి, జెకెసి ఎఫ్‌టిఎం టి.కిషోర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ధనంజయులు యాదవ్

విజయపురం, జూలై 13 ప్రభాతవార్త :

విజయపురం మండలానికి చెందిన ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనంజయులు యాదవ్ గురువారం అమరావతిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గంలో పార్టీ బలంగా వుందని, వచ్చే ఎన్నికల్లో నగరిలో టిడిపి విజయానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎల్లపుడూ ప్రజల్లో వుంటూ అధికార వైసిపి అన్యాయాలు, అక్రమాలు ప్రజలకు వివరించి టిడిపి విజయానికి పాటుపడాలని చంద్రబాబు సూచించినట్టు తెలిపారు.

ఐటిఐలో ప్రవేశానికి ధరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, జూలై 13 ప్రభాతవార్త :

మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటిఐలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ గణేష్ గురువారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఆసక్తి వున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డబ్లుడబ్లుడబ్లు.ఐటిఐ.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో ధరఖాస్తులు పూర్తి చేసి, అన్ని ధృవపత్రాలు నకళ్లతో పాటు ఒక ఫోటో జత చేసి ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో సమర్పించాలని వివరించారు. ఈ నెల 31 లోపల సర్టిఫికెట్ తనిఖీ పూర్తయిన తర్వాత ఆగస్టు 3వ తేదీన ఐటిఐ ఆవరణంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి వుంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రేపు పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో 'యువ ఉత్సవ్'

తిరుపతిరూరల్, జూలై13 ప్రభాతవార్త: నెహ్రూ యువకేంద్రం చిత్తూరు ఆధ్వర్యంలో ఈనెల 15న స్థానిక పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో 'యువ ఉత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గురుమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారని తెలిపారు. ఈ యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, నృత్యం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేవాళ్లు ఈనెల 15 9:30 గంటలలోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. పోటీలలో 15 నుండి 20 సంవత్సరాలు వయస్కులు అర్హులని, పోటీలలో గెలుపొందినవాళ్ళకు బహుమతులు అందజేయబడునని తెలిపారు. ఇతర వివరాలకు 9908127829 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

దేశంలోనే ఆదర్శం 'జగనన్న సురక్ష' కార్యక్రమం

-తిరుపతిరూరల్లో 1260 సర్టిఫికేట్స్ పంపిణి -చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై13 ప్రభాతవార్త:

దేశంలోనే ఆదర్శంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని చంద్రగిరి వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందుకోలేనివారి కోసం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికేట్స్‌ను ఏలాంటి రుసుం లేకుండా ఉచితంగా అందజేయబడునని తెలిపారు. గురువారం జగనన్న సురక్ష శిభిరాలను మంగళం-2, చైతన్యపురం, మల్లంగుంట సచివాలయ పరిధిలలో నిర్వహించారు. ఈ మూడు సచివాలయాలు పరిధిలో 1260 సర్టిఫికేట్స్‌ను ఉచితంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఎవ్వరు చాటిరారని, నిత్యం ప్రజలకు ఎదో ఒకటి చేయాలనే తపనతోనే ఆయన ఉంటారని పేర్కొన్నారు. పండగల సమయంలో దుస్తులు, స్వీట్స్ పంచడమే కాకుండా కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజలను కనురెప్పవలే కాపాడుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.ఉపేంద్రరెడ్డి, రామచంద్రయ్య, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనల క్రింద లైటింగ్ ఆకర్షణీయంగా వుండాలి

కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జులై 13, ప్రభాతవార్త

తిరుపతి నగరంలోని రైల్వే వంతెనల క్రింది లైటింగ్ సిస్టమ్ ఆకర్షణీయంగా వుండేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. చెన్నై పిలిప్స్ ఏజెన్సీ వారు తీసుకొచ్చిన అధునాతన, కలర్స్ ప్రతిబింబించే లైట్ల డెమోను కమిషనర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రధానమైన రహదారులు వెలుతున్న రైల్వే అండర్ బ్రిడ్జులు వెస్ట్ చర్చి ముందుస్తున్నది, పళణీ థియోటర్ రోడ్డు వెల్లే మార్గంలోనిది, ఈస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద నున్న అండర్ బ్రిడ్జిల్లో లైటింగ్ సరిగా లేదని, ఆప్రాంతాల్లో రాత్రులందు ఆకర్షణీయమైన లైటింగ్ సిస్టమ్ ప్రజలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్నారు. అదే విధంగా డేయిరీ ఫామ్ ముందర ఏర్పాటు అయిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పై కూడా ఆకర్షణీయుమైన లైటింగ్ ఏర్పాట్లకు చర్యలు తీసుకొనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఫిల్పిస్ ఏజెన్సీ వారు డెమో చూపించిన ఫాసేడ్ లైటింగ్ సిస్టమ్స్‌ను పరిశీలిస్తూ తగు నిర్ణయం తీసుకుని లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు త్వరలో ఆమోదం తెలపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ డిఈ నరేంద్ర, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటీకి గొల్లపల్లి విద్యార్థినులు ఎంపిక

పుత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిధిలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో 10వ తరగతి చదివిన విద్యార్థిని ఎం.హాసినికృష్ణ(ఇడుపుల పాయ) త్రిబుల్ ఐటీకి ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థినిని ఎంఈవో తిరుమలరాజు, సర్పంచ్ విరిత, వైసీపీ నాయకుడు దేవేందర్‌రెడ్డి పూలమాల, శాలువతో సత్కరించారు. అలాగే పుత్తూరు పట్టణంలో జడ్పీహైస్కూలుకు చెందిన ప్రతిమ కూడా త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రతిమను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అభినందించారు.

జగనన్న పాలనలో ప్రతిరోజు పండగే - మంత్రి రోజా

పుత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త:

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటి వద్దే ఉచితంగా అందుతోందని మంత్రి రోజా అన్నారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీ అంబేడ్కర్ సచివాలయ పరిధిలోని 15,25,26 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌కు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగనన్న సురక్షలో నమోదు చేసుకున్న 727 సర్టిఫికెట్లు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా నేడు 276 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, 201 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 132 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, 117 మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, ఒకరికి హౌస్ హోల్డ్ విభజన జరిగిందంటే అందుకు జగనన్న ప్రవేశపెట్టి సురక్ష పథకమే కారణమన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు అందించడంతో పాటు పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, డీఈ కౌన్సిలర్లు ఏకాంబరం, స్టేట్ డైరెక్టర్లు, బోర్డు చైర్మన్‌లు, డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీరు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆచార సంప్రదాయాలకు తిలోదకాలివ్వటం తగదు

శ్రీకాళహస్తి,జూలై 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు తర తరాలుగా ఆచరిస్తున్న సంప్రదాయాలు, ఆచారాలకు దేవస్థానం అధికారులు తిలోదకాలివ్వటం దారుణమని పట్టణ తెలుగుదేశం ప్రదాన కార్యదర్శి, మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు కాసరం రమేష్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు భక్తులు దర్శించుకొనుటకు మన పూర్వికులు నిర్మించారని కానీ నేటి అధికారులు నిబంధనల పేరుతో ఆంక్షలు విధించటం తగదన్నారు.ముఖ్యంగా కైలాసగిరుల్లోని లోబావిలో కొన్ని తరాలుగా మునీశ్వరస్వామి,గురప్పస్వామి, కాటేరీలకు పూజలు జరుపుకోవటం సంప్రదాయాల మేరకు పూజలు నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. ధర్మకర్తల మండలి స్థానికుల మనోభావాలను పరిగణలోకి తీసుకొని ఆంక్షలకు స్వస్తి చెప్పాలని రమేష్ కోరారు.

ప్రజల కోసమే ఆలోచించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా

నింద్ర,జూలై 13 ప్రభాతవార్త : యెల్లవేళలా ప్రజల కోసమే ఆలోచించే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా తెలిపారు.గురువారం మండలంలోని ఇరుగువాయి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాశక్తిని నమ్ముకుని వాళ్ళుకు మంచి చేస్తే ఆకుటుంబాలు భాగుంటాయని జగనన్న భాగుంటేనే రాష్ట్రం భాగుంటుందని మీరు బాగుంటారని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మీకష్టాలు చూసారని వాటి పరిష్కరించడానికి మొదటి నుంచి పరిష్కరించే విధంగా అనేక సంక్షేమ పథకాలు తీసుకొని వచ్చి ఆదుకుంటావుండారని తెలిపారు.2014వ సంవత్సరంలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు 600 హామిలు ఇచ్చి ఒక్క వాగ్దానం కూడా అమలుపరచలేదని విమర్శించినారు.వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలలో 98శాతం అమలు పరిచినారని అన్నారు.ఇరుగువాయిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 1015 సర్టిఫికేట్‌లను మంత్రి ఆర్‌కె రోజా చేతిల మీదగా అందజేసారు.ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్‌రాజు,తహశీల్దారు అమరేంద్రబాబు,యంపిడిఓ అరుణ,సింగల్‌విండో చేర్మన్ మునికృష్ణరెడ్డి,గ్రామ సర్పంచ్ రాజేష్,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,నాయకులు అనిల్‌కుమార్,మహేష్,మేరీజయరామ్, బాబురెడ్డి,రాము,విజేష్, దాము,మండల విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు,తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు సన్మానం

నగరి, జూలై 13 ప్రభాతవార్త: మండలంలోని గుండ్రాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు మనోజ్‌కుమార్, హరిప్రసాద్, మురళి, శ్రీనివాసులకు గురువారం స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి దుస్సాలువలు, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు పాఠశాలలో చేసిన సేవలను ప్రధానోపాధ్యాయురాలు నీరజారాణి, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యంస్వామి వార్లకు ప్రత్యేకపూజలు

కార్వేటినగరం,జూలై 13 ప్రభాతవార్త:

కార్వేటినగరం స్కందపుష్కరిణి సమీపంలో కొమరగిరి గుట్టపై వెలసియున్న శ్రీవళ్ళిదేవయాని సమేత సుబ్రమణ్యంస్వామి వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గురువారం కృత్తిక సంధర్భంగా స్వామివార్లకు పాలు,పెరుగు,తేనే,పసుపు,చందన

మహిళలకు క్రీడల్లో నైపుణ్యం అవసరం

ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కే. సంతోష రావు

తిరుపతి కలెక్టరేట్, జులై 13, ప్రభాతవార్త : ఏపీ ఎస్పీ డీసీఎల్ మహిళా ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష్ రావు సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం ఏపీఎస్పి డీసీఎల్ మహిళా క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం టేబుల్ టెన్నిస్ చెస్ క్యారమ్స్ తదితర క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. అనంతరం ఏపీ ఎస్పీ డీసీఎల్ ఆధ్వర్యంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న టెన్నిస్ కోర్టును పరిశీలించారు. టెన్నిస్ విభాగంలో ఉద్యోగులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డిసీఎల్ డైరెక్టర్లు విఎస్ బాబు, ఎన్‌విఎస్ సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వరకుమార్, వై. లక్ష్మి నరసయ్య, కెఆర్ఎస్ ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ ఏ. రాధా జయశ్రీ, జనరల్ మేనేజర్లు రమణాదేవి, శోభా వాలెంటీనా, శారద, గోపాలకృష్ణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. కృష్ణా రెడ్డి, రూపలత, మహేశ్వర్ రెడ్డి, వాసవీలత, చలపతి, అశోక్ కుమార్, నరసింహబాబు, బాలాజీ, అమీర్‌భాషా, రాజులు పాల్గొన్నారు.

22 నుంచి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం ప్రారంభం

తిరుపతి కలెక్టరేట్, జులై 13 ప్రభాతవార్త : తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం గురువారం ప్రారంభమైంది. జులై 22వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ ఆండాళ్ అమ్మవారికి ఏకాదశి తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం సమర్పణ జరిగింది. ఆ తరువాత శ్రీ ఆండాళ్ అమ్మవారిని జిఎస్ మాడ వీధి, గాంధీ రోడ్డు మీదుగా గంగుండ్ర మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థానం నిర్వహించారు. అనంతరం తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్ రెడ్డి, సూపరింటెండెంట్‌లు నారాయణ, మోహన్ రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.

16 నుండి తిరుమలలో 'ఏడుకొండల నృత్యోత్సవాలు'..

-శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 13 ప్రభాతవార్త: శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమల ఆస్థానమంపంలో ఈనెల 16,17,18 తేదీలలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి 'ఏడుకొండల నృత్యోత్సవాలు' నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవ స్థాపకుడు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. గురు వారం జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహంలో ఆయన చేతుల మీదుగా కార్యక్రమానికి చెందిన ఆహ్వాన పత్రికను ఆవిష్క రింపచేశారు. అనంతరం సరేష్ మాట్లాడుతూ ఏడు కొండల మీద ఏడు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది 7వ నెల అయిన జూలైలో ప్రతి రోజు 7 గంటల పాటు 7 భారతీయ కళలతో 7 మంది గురువులను సత్కరిస్తూ, 700 మంది కళాకారులతో ఆ ఏడుకొండల స్వామికి నాట్య నీరాజనం అర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమం తాము నిర్వహిం చడానికి కారణం..భారతీయ కళలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలన్న ఏకైక లక్ష్యమేన న్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, ముర్రంశెట్టి రాములు, కాణిపాకం ఆలయ పాలకమండలి సభ్యుడు మువ్వల నరసింహులుశెట్టి, ఎస్‌సిజెడ్‌సిసి ప్రోగ్రాం కమిటీ మెంబర్ కుంచ లక్ష్మీపతి పాల్గొన్నారు.

చంద్రయాన్ యాత్ర విజయవంతం కావాలని..శివయ్యకు పూజలు

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త : దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీ శ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని సేవ లో అతిథులు అత్యధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి సమీపంలోని శ్రీహరికోటలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షార్ కేంద్రం వెలసి ప్రయోగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ప్రయోగం సందర్భంగా షార్ ప్రతినిధి బృందం శివయ్య సన్నిధిలో పూజలు జరిపి తమ ప్రయత్నం విజయవంతం కావాలని పూజలు జరుపుకొని మొక్కుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ కౌంట్ డౌన్ సందర్భంగా గురువారం ఇస్రోస్పేస్ కమిషన్ అధికారులు పూజలు జరుపుకున్నారు. చంద్రయాన్ విజయవంతం కావాలని భారత దేశ పేరు ప్రఖ్యాతులు ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందాలని పూజలు జరిపారు. వారికి స్వామి అమ్మవార్ల సన్నిధిలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం, హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

కియా కారెన్స్ యం డ్రైవ్ కారు విడుదల

తిరుపతి, జూలై 13 ప్రభాతవార్త : చెన్నై-బెంగళూరు రహదారి నందు హూషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కారు షోరూంలో గురువారం యం డ్రైవ్ కారును మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కియా కంపెనీ నుండి విడుదల చేయబడుతున్న మొట్టమొదటి ట్యాక్సీ కారుగా యండ్రైవ్‌ను అత్యాధునికి సదుపాయాలతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కారును మల్టీ యుటిలిటీ హంగులతో పాటు 7 సీటర్‌లో అందుబాటులో ఉన్నది. జి15 పెట్‌రోల్ మాన్యువల్ వేరియంట్‌లోను, డి15 డీజిల్ ఉఎంటి వేరియంట్‌లోను అందుబాటులో కలదని తెలిపారు. అంతేకాక ఈ కారు ట్రావెల్స్ రంగంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కియా కంపెనీ డైరెక్టర్లు చెరకు నిరంజన్, సి.భారతి, సి.హూషిమరెడ్డి, సి.ఆశిష్‌రెడ్డి, ఎజిఎం ఎస్.వంశీ, జనరల్ మేనేజర్ ఎం.సతీష్‌బాబు, షోరూమ్ మేనేజర్ ఇ.సోమనాథలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్య సేవలో సాంస్కృతిక అదనపు కార్యదర్శి

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో భారత ప్రభుత్వ సాంస్కృతిక విబాగం అదనపు కార్యదర్శి కి.రాజన్ చోప్రాజి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లకు పూజలు జరుపుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కెయస్ రామారావు, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేదపండితులు, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనాల తరువాత వారికి వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు, శేష వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఓ వినతి పత్రం అందిస్తూ వర్షా కాలం ఆలయం పురాతనమైనది కాబట్టి లీకేజీలు ఏర్పడి భక్తులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. పురావస్తుశాఖ అధికారులు పరిశీలన తరువాత రూ.3.5కోట్ల వ్యయం అవుతుందని అంచనా ప్రతిపాదనలు ఇచ్చారని వివరించారు. ఆలయ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా అంత వ్యయం చేయలేమన్నారు. భక్తులు, యాత్రికుల సహాయార్థం ఆలయ పైకప్పును కేంద్ర నిధులతో చేపట్టాలని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాజన్ ఛోప్రాను కోరారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌డిఓ కెయస్ రామారావు, వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి ఆలయాధికారులు టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, దాము, వేదపండితులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శివయ్య సేవలో కేంద్ర మంత్రి సతీమణి

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారి సతీమణి కాంచన గడ్కారి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ శోభను, శిల్పకళాసందను, కట్టడాన్ని గమనించిన కాంచన గడ్కారి ఆశ్చర్యం వ్యక్తం చేసారు. నేటికి కొత్త ఆలయంగా ఉందని అభివర్ణిస్తూ ఆలయాన్ని ఎప్పుడు నిర్మించారని ప్రశ్నించగా ఆమెకు వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి వివరించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద పవిత్రారెడ్డి శేష వస్త్రాలను అందజేసారు. వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఒ సతీష్ మాలిక్, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, పిఆర్‌ఓ వెంకట్‌స్వామి ఆలయాధికారులు సిబ్బంది పర్యవేక్షించారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పార్టీ టిక్కెట్టు ఎవరైనా ఆశించవచ్చు : బొజ్జల సుధీర్‌రెడ్డి

-ఈనెల 15న శ్రీకాళహస్తిలో చైతన్య రథయాత్ర -తొట్టంబేడు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం

శ్రీకాళహస్తి, జూలై 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ టిక్కెట్టును ఎవరైనా ఆశించవచ్చని శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే పార్టీ విజయం కోసం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ టిక్కెట్టు కోసం మీడియా సోదరులు కూడా ప్రయత్నించుకోవచ్చని సుధీర్‌రెడ్డి ఛలోక్తి విసిరారు. నేడు రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిస్థితుల దృష్ట్యా పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ టిక్కెట్టుకు సంబందించి అధ్యక్షులు చంద్రబాబునాయుడు తనకు స్పష్టం చేశారని సుధీర్‌రెడ్డి వివరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం 9గంటలకు రేణిగుంట ప్లై ఓవర్ నుంచి ప్రారంభమయ్యే చైతన్యరథయాత్రలో రాయలసీమ జోన్-4 నుంచి వచ్చే పార్లమెంటు నాయకులు, ఇతరులు సుమారు 30మంది వరకు బస్సులో ఉంటారన్నారు. రథయాత్రలో రేణిగుంటలో రెండుమూడు చోట్లు ఆగుతుందని, ఏర్పేడులో మరో రెండు మూడు చోట్ల ఆగి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జగన్‌రెడ్డి పాలనలో ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి చేసిన అరాచకాలపై సెల్ఫీలు తీసుకుని తెదేపా అధినేతకు పంపుతామన్నారు. రేణిగుంట నుంచి ప్రారంభమయిన బస్సుయాత్ర ఏర్పేడు, ఊరందూరు మీదుగా శ్రీకాళహస్తి ఎపిసీడ్స్‌కు చేరుకుంటుందని వివరించారు.

శ్రీకాళహస్తిలో పోలీసుల అరాచకపాలన..

శ్రీకాళహస్తిలో పోలీసుల అరాచకపాలన సాగు తోందని ఎంఎల్ఏ పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తున్నారని బొజ్జల సుధీర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తిలో అర్బన్ సిఐగా ఉన్న అంజూ యాదవ్ ఆగడాలు మితిమీరి పోయానని ఇటీవల ఓ మహిళను కాలితో తన్నడంతో పాటు, రెండు రోజుల క్రితం జనసేన కార్యకర్తను పోలీస్ స్టేషన్‌లోనే కొట్టడం ఆమె దౌర్జన్యకాండకు నిదర్శనమని చెప్పవచ్చన్నారు.

తొట్టంబేడులో రచ్చబండ కార్యక్రమం..

తొట్టంబేడు గ్రామంలో ఈనెల 15న రచ్చబండ కార్యక్రమం ఉంటుందని బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. సుమారు 2వేల మందితో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు రాత్రి అక్కడే పల్లెనిద్ర ఉంటుందని తిరిగి ఉదయం సత్యవేడు నియోజకవర్గంకు చైతన్య రథయాత్ర బయలు దేరుతుం దన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, మిన్నల్‌రవి, చెలికంపాపిరెడ్డి, బషీర్, డివి.నారాయణ, షఫీ, వినయ్, లక్ష్మణ్, హేమంత్, పోలూరు శ్రీనివాసులురెడ్డి, జిలానీ, ఆర్మగం, కిషోర్, ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, మునిరాజయాదవ్, మునిరాజనాయుడు, ధనంజయులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక వేడుకలు

నాయుడుపేట, జులై 13 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీకల్యాణ సంతాన షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు చదలవాడ మోహనకృష్ణశర్మ ఆధ్వర్యంలో ఆడికృత్తిక మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామివారిని చందనాలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. 108 వేళాయుధములతో పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఖండంతరాలు దాటిన తరగని అభిమానం : గాలి భానుప్రకాష్

నగరి, జూలై 13 ప్రభాతవార్త: ఖండంతరాలు దాటిన అభిమానం తగ్గలేదని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. అమెరికా లోని చికాగోలో యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, నగరి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. లోకేష్‌కి నగరిలోని పలు అభివృద్ధి సమస్యల గురించి వివరించారు.

జగనన్న పాలనలో ప్రతి రోజు పండగే : మంత్రి రోజా

ఓజీ కుప్ప సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి రూ.12.5 కోట్లు

నగరి, జూలై 13 ప్రభాతవార్త: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సేవలు ప్రజలకు ఇంటి వద్దే ఉచితంగా అందుతోందని మంత్రి రోజా అన్నారు. గురువారం మండలంలోని ఓజీ కుప్పం సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగనన్న సురక్షలో నమోదు చేసుకున్న 651 సర్టిఫికెట్లు ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా నేడు 318 మందికి ఆదాయ సర్టిఫికెట్లు, 315 మందికి ఇంటిగ్రేటెడ్‌సర్టిఫికెట్లు, 10 మందికి ఆధార్ మొబైల్ లింకింగ్, 5 మందికి బర్త్ సర్టిఫికెట్లు, ఇద్దరికి ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, ఒకరికి హౌస్‌హోల్డ్ విభజన జరిగిందంటే అందుకు జగనన్న ప్రవేశపెట్టి సురక్ష పథకమే కారణమన్నారు. 11 రకాల సర్టిఫికెట్లు అందించడంతో పాటు పథకాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు జగనన్న సురక్షకార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధికి రూ.12.50 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. కరోనా సమయంలో మన ప్రభుత్వం చేసినన్ని సేవలు దేశ వ్యాప్తంగా ఎవరూ చేయలేదన్నారు. ఆరోగ్యశ్రీ మూడు వేలకుపైగా జబ్బులను చేర్చి మెరుగైన సేవలు చేస్తున్నామన్నారు. రెండు సార్లు ప్రజలు ఇచ్చిన ఆధరణతోనే నేడు మంత్రిగా ఉన్నానని, ప్రజల పక్షాన నిలబడ్డ తనను ప్రజలు మూడోసారి కూడా తప్పక ఆదరిస్తార న్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మెటర్నరీ ఏడీ వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ మోహన్, సచివాలయ కన్వీనర్ హరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం

కార్వేటినగరం, జూలై 13 ప్రభాతవార్త: కార్వేటినగరం మండల కేంద్రంలో జనసేనపార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. పవన్‌కళ్యాణ్ మాటలు వక్రీకరించినందుకు నిరసనగా జనసేనపార్టీ కార్యకర్తలు సిఎం దిష్టిబొమ్మను పురవీధుల్లో ఊరేగిం చారు. ప్రభుత్వపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికే వాలంటీరు వ్యవస్థను ఏర్పాటు చేశారని, సభలు, సమావేశాలకు ప్రజలు రాకపోతే ప్రభుత్వపథకాలు రద్దు చేయిస్తామని వాలంటీర్ల ద్వారా ఒత్తిడి చేయిస్తున్నారని ఇలాంటి వాటికి వారిని ఉపయోగిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే నారాయణస్వామి మూడు పర్యాయాలు ఎన్నికైనా ఆయన ఉద్ధరించింది ఏమీ లేదని పొన్నా యుగందర్ విమర్శించారు. ఎమ్మెల్యే నారాయణస్వామి వారి కుటుంబసభ్యులను రాజకీయంగా రాణిస్తున్నారని, ఇతరులను అణచివేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శోభన్‌బాబు, టౌన్‌కమిటీ అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు విజయ్, సురేష్‌రెడ్డి, లోకేష్‌రాయల్, ప్రధానకార్యదర్శి వెంకటేష్, యువజన అధ్యక్షులు నరసింహులు, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, కార్యకర్తలు భాను చంద్రరెడ్డి, మణి, సూర్య, మహేంద్ర, సతీష్, యతీశ్వరరెడ్డి, అన్నామలై, శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

భక్తుల స్వహస్తాలతో శ్రీసాయినాథునికి పాలాభిషేకం

పుత్తూరురూరల్, జూలై 13 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువ జామున రెండు గంటలకు సుప్రభాతం, శుభోదయం భూపాలి 3.30 గంటలకు కాకడ హారతి(ప్రభాత హారతి) ప్రాత కాలం 4.30 గంటలకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు సాయం సంధ్య హారతి, రాత్రి 8 గంటలకు సేజ్ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు క్యూలైన్‌లో స్వామివారికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో

రహదారుల అభివృద్ధిపై చర్చ

-కేంద్రమంత్రి గడ్కరీని కలసిన మంత్రి పెద్దిరెడ్డి

తిరుమల, జులై 13ప్రభాతవార్తప్రతినిధి: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతి, చిత్తూరుజిల్లాల్లో రహదారుల అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. ఈ మేరకు గురువారం ఉదయం తిరుమలలోని అతిథి గృహంలో మంత్రి పెద్దిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను బహుకరించారు. మంత్రితోబాటు వైసిపి నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, జయచంద్రారెడ్డి ఉన్నారు.

పవిత్ర ప్రతిష్టతో...కోదండరాముని పవిత్రోత్సవాలు ఆరంభం

తిరుపతి, జులై 13ప్రభాతవార్త: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో కోదండరామ ఆలయంలో పవిత్రోత్స వాలూ ఆరంమయ్యాయి. గురువారం ఉదయం సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్రప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ పార్థసారధి, కంకణభట్టార్ ఆనందకుమార్‌దీక్షితులు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్‌లు చలపతి, సురేష్ ,అర్చకులు పాల్గొన్నారు .

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

తిరుచానూరు, జులై 13 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఉదయం శ్రీవారి దర్శన అనంతరం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనార్థం ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకున్న కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరికి టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, తిరుపతి పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, ఇతర అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి ముందుగా అమ్మవారి ఆలయ ధ్వజ స్తంభమునకు మొక్కిన అనంతరం శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం పలకగా టిటిడి చైర్మన్ తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం వెలుపల బిజేపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ మేడసాని పురుషోత్తం నాయుడు, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, బిజేపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, తిరుచానూరు నాయకులు విజయ్ కుమార్, రమణ, విజయ్, మణి తదితరులు పాల్గొన్నారు. మేఘాలయ గవర్నర్ పాగు చౌహాన్ వేరుగా దర్శించుకున్నారు. వీరితో పాటు గుండాల గోపినాథ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించండి సారూ...

-బై పాస్ చౌరస్తాలలో అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి

-కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కొరిన బడి సుధాయాదవ్

తిరుపతిరూరల్, జూలై13 ప్రభాతవార్త: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుపతి పరిసర ప్రాంతాల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయని, పదుల సంఖ్యలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, వేల సంఖ్యలో క్షతగాత్రులు మారుతున్న ఏ ఒక్క ప్రజా ప్రతినిధి పట్టించుకోవడం లేదని బి.సి.కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, పుదిపట్ల గ్రామ సర్పంచ్ బడి సుధాయాదవ్ ఆవేదన వ్యక్తం చేసారు. గురువారం తారకరామ స్టేడియంలో కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి, బై పాస్ రోడ్డు చౌరస్తాలలో అండర్ పాస్‌లు బ్రిడ్జిలు లేనందున జరిగే ప్రమాదాలను వివరించి, వినతిపత్రం అందజేసారు. తిరుపతి 200 బై పాస్ రోడ్డులో ప్రమాదాలు నిత్యకృత్యమని, అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారని, అనేక మంది వికలాంగులై మంచాలకే పరిమితమైయ్యారని పేర్కొన్నారు. ముఖ్యంగా మదనపల్లి - నాయుడుపేట జాతీయ రహదారి ఎన్‌హెచ్71లో వకుళమాత ఆలయం కూడలి, ఉప్పరపల్లి, అవిలాల, తనపల్లి కూడళ్ళ వద్ద అండర్ పాసులు ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ స్పందిస్తూ రోడ్డు ప్రమాదాలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు వెంటనే డిపిఆర్‌లను తయారు చేయాల్సిందిగా ఆదేశించారు.

జనసైనికుల పట్ల సిఐ అంజూ యాదవ్ తీరు అమానుషం

-ఆమెను తక్షణం సస్పెండ్ చేయాలి

-జనసేన జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 13 ప్రభాతవార